క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపాల్ పరుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 3వ తరగతిలో 40 సీట్లు ఉండగా అందులో 32 ఎస్టీ, 5 ఎస్సీ, 2 బీసీ, 1 ఓసీకి కేటాయించామని తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాగ్‌లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94408 83284, 81065 67470 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

ఎంపీ నందిగం సురేష్‌పై దాడి అమానుషం


కాటుకూరి బాబురావు

యద్దనపూడి: దళిత ఎంపీ నందిగం సురేష్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేయటం అమానుషమని జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కాటుకూరి బాబురావు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. టీడీపీ వాళ్లు ఓటమి భయంతోనే ఒక దళిత ఎంపీని అడ్డగించి దాడి చేయించి వారిని అసభ్య పదజాలంతో దూషించటం హేయమైన చర్య అన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం అధికారులు దాడికి పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, ఆరుద్ర నక్షత్రం, చవితి తిథి, సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అద్దంకి నుంచి 12 బస్సులు

అద్దంకి రూరల్: సోమవారం జగరనున్న సార్వత్రిక ఎన్నికలకు అద్దంకి నుంచి సిబ్బందిని తరలించేందుకు 12 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు డీయం రామ్మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి నుంచి పర్చూరుకు 10 బస్సులు, అద్దంకి నుంచి మార్టూరు, పర్చూరు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లెకు 2 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు శంకర జయంతి వేడుకలు

ఒంగోలు మెట్రో: ఎర్రన సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పది గంటలకు స్థానిక లాయర్‌పేట సాయిబాబా గుడి ఎదురు వీధిలోని హరే రామ బిల్డింగ్ వద్ద జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు శ్రీనివాసులు, చిలకపాటి రంగారావు, ప్రముఖ సాహిత్యవేత నెమ్మాని సీతారామమూర్తి పాల్గొని శంకరాచార్య ఆర్షధర్మ సేవల గురించి ఉపన్యసిస్తారని, ఆధ్యాత్మిక ప్రేమికులు శంకరాచార్య స్వామి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

అద్దంకిని అభివృద్ధి చేసే బాధ్యత నాది


పానెం చిన హనిమిరెడ్డి, అద్దంకి, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, అభ్యర్థి

అద్దంకి: సరిగా ఆరు నెలల క్రితం ఆయన కాలు మోపాడు. అంతే అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజల మధ్యే తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ నేనున్నాంటూ భరోసానిస్తున్నాడు. సమస్యలతో వచ్చిన ప్రతి ఒక్కరికీ ధైర్యం చెప్పి వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్నాడు ఆయనే అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి. నేను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటున్న హనిమిరెడ్డితో ముఖాముఖి..

పేదరికం నుంచి వచ్చా..

నేను పేదరికం నుంచే వచ్చా. నాకు పేదల కష్టనష్టాలు తెలుసు. నేనూ రైతు బిడ్డనే. నా తల్లిదండ్రులు పొలం పని చేసేవాళ్లు. నేనూ పొలం పని చేసేవాడిని. ఎంబీఏ చేసి చిన్న ఉద్యోగం కూడా కొన్నాళ్లు చేశా. పట్టుదలతో స్నేహితుల సహకారంతో ఇంతవాడిని అయ్యా. నాలాగే పేద సాదల జీవితాలు బాగుపరచాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చా. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చూస్తా.

అన్ని వర్గాలకు అండగా..

నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వ్యాపార, బడుగు బలహీనవర్గాల వారికి నేను అండగా ఉంటా. వ్యాపారుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కారం అయ్యేలా చూస్తా. వ్యాపారంలో నాకు అనుభవం ఉంది. కష్టనష్టాలు బాగా తెలుసు.

రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా అద్దంకి

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి పోటీ చేసే అవకాశం కలిగింది. ఇక్కడి ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిస్తే అద్దంకిని రాష్ట్రంలోనే మోడల్ నియోజవకర్గంగా అభివృద్ధి చేసి చూపిస్తా. అద్దంకి తోపాటు ఐదు మండలాల్లో వచ్చి నాలుగు నెలల్లోనే గమనించిన సమస్యలు చాలా ఉన్నాయి వాటన్నింటినీ పరిష్కరిస్తా.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

నేను నాన్ లోకల్ అయినా ఇక్కడే ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉంటా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తా. ఏ చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకు రండి. ఏ సమయంలోనైనా ఫోన్ చేస్తే స్పందిస్తా. మీ సమస్య నాకు చెప్పి మీరు హాయిగా నిద్రపోవచ్చు. మీ సమస్యను నా సమస్యగా భావించి పరిష్కరిస్తా. అద్దంకిని ఆంధ్రలోనే మోడల్‌ని యోజకవర్గంగా తీర్చిదిద్దుతా. అద్దంకి పట్టణ అభివృద్ధి, విద్య, వైద్యశాలల అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తాను.

నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే..

అద్దంకిలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తా. వైద్యశాలను 100 పడకల వైద్యశాలకు మార్పిడి చేసి స్పెషలిస్ట్ వైద్యం ప్రజలకు అందే విధంగా చేస్తా. కొరిశపాడు మండలంలో ఎత్తిపోతల పథకాలు, అద్దంకి భవనాశి మినీ రిజర్వాయర్‌ను పూర్తి చేయించి పంట పొలాలకు సాగునీరు అందించే విధంగా చూస్తా. వ్యాపార వర్గాలు, కూలీలకు అండగా ఉండి వారి సమస్యలు, ఇక్కడే ఉండి ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తా. అసెంబ్లీలో అద్దంకి వాణిని వినిపిస్తాను.

హోరు ముగిసింది.. పోరు మిగిలింది

- ప్రచారాలకు ఫుల్‌స్టాప్
- ఆఖరిరోజు హోరెత్తిన ప్రచార పర్వం


ఓటర్లకు నమస్కరిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్, ఎంపీ నందిగం సురేష్

చీరాల టౌన్: మైకుల హోరు, కరపత్రాల పంపిణీ, కార్యకర్తల ర్యాలీలు, డీజే పాటల శబ్దాల జోరుకు క్లైం పడింది. మరో 48 గంటల్లో సార్వత్రిక పోరు ఆఖరి ఘట్టానికి చేరుకోనుంది. గత 60 రోజులుగా తెలియని వారిని కూడా ఆప్యాయంగా పలుకరిస్తూ.. యోగక్షేమాలను అడిగి తెలుసుకునే పనిలో పూర్తిగా నిమగ్నమైన అభ్యర్థులు చేసిన ప్రచారాలు., ఇచ్చిన హామీలకు, అభివృద్ధి చేస్తాం ఒక్క అవకాశం ఇవ్వండని జోరుగాసాగిన ప్రచారాలకు శనివారం సాయంత్రానికి ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నికలు జరగనున్న 48 గంటల్లోపు అభ్యర్థులు ఎన్నికల ప్రచారాలను నిలిపివేయాలని ఈసీ ఆదేశాలు ఇవ్వడంతో ఆఖరిరోజు చీరాల నియోజకవర్గంలో ప్రచారం హోరెత్తింది. గెలుపు కోసం వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఉవ్విళ్లూరుతుంటే, పట్టుకోసం టీడీపీ పాకులాడుతోంది. అసలు డిపాజిట్లు అయినా వస్తాయా ? అంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదపడుతున్నాడు. నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజు కావడంతో చీరాల, వేటపాలెం మండలాల్లోని 24 గ్రామపంచాయతీలతో పాటు, పురపాలక సంఘంలోని 33 వార్డుల్లో ప్రచారం ఉవ్వెత్తున సాగింది.

కరణం వెంకటేష్ విస్తృతంగా ప్రచారం..

2019 నుంచి ఐదేళ్లపాటుగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన మళ్లీ రావాలన్నా. రాష్ట్ర ప్రజలందరికి సంక్షేమ ఫలాలు అందరికి అందాలంటే ఎన్నికల్లో ఫ్యాన్‌కు ఓట్లేసి వైఎస్ జగన్‌తో పాటుగా అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం పురపాలక సంఘంలోని పలువార్డుల్లో, మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపే తనను ఆదరించాలని, ఓటర్లు అమూల్యమైన ఓటును ఫ్యాన్‌గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలకు సూచించారు.

ఇతర పార్టీల ఆధ్వర్యంలో..

టీడీపీ కూటమి ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థి ఎంఎం కొండయ్య మున్సిపాలిటిలోని పలువార్డులు, రూరల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఓటుద్వారా మంచి పాలన అందించే నాయకులను ఎన్నుకోవాలన్నారు. టీడీపీకి అందరూ ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్ ప్రచారాన్ని చేశారు.

మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తా


యడం బాలాజీ, పర్చూరు, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, అభ్యర్థి

చినగంజాం: మాటల్లో స్పష్టత, ఎవరైనా ఆపదతో వస్తే ఆదుకునే సహాయ గుణం, నమ్ముకున్న వాళ్లకు అండగా నిలబడే స్నేహితుడు, నాయకులు, కార్యకర్తలను పేరుపేరునా గుర్తించుకొని ఆప్యాయంగా పలకరించి మనస్తత్వం. రాజకీయ వారసత్వం నుంచి లక్షణాలు పుణికి పుచ్చుకున్న యడం బాలాజీ. పర్చూరు నియోజకవర్గంలో నేను గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చేస్తానని చెప్తున్న ఆయనతో ముఖాముఖి..

ప్రజాసేవలోనే యడం కుటుంబం..

ప్రజలకు సేవ చేయాలనే తపనతోనే రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయం నాకు వారసత్వంగా వచ్చింది. మా తాత యడం చెన్నయ్య రేపల్లె శాసన సభ్యుడిగా మూడు పర్యాయాలు చేశారు. 1955, 1967, 1972లో ఆయన అక్కడ పోటీ చేశారు. తండ్రి యడం చినరోశయ్య చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, 2009 నుంచి 2013 వరకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా పనిచేశారు. తాను కూడా 2014 నుంచి రాజకీయాలలోకి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్తగా కొనసాగాను. తనకు తాతనుండి రాజకీయ వారసత్వం ఉంది. 2014 నుంచి యడం చినరోశయ్య ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలని చేపట్టాం. కరోనా సమయంలో బాధితులకు ఆక్సిజన్ సిలిండర్‌లను ఉచితంగా సరఫరా చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడాం.

నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టో పక్కాగా అమలు చేస్తాం..

నవరత్నాలు పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి అందించారు. ప్రస్తుతం అదే పథకాలతో కూడి నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో కొనసాగింపు చేయడం అత్యద్భుతం.ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తాం. దీని ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి దొరుకుతుంది. ఇప్పటివరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 6 లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించింది. స్కిల్ హబ్‌ల ఏర్పాటుతో యువతలో నిరుద్యోగత తొలగించే ప్రయత్నం చేస్తా.

స్థానికల సమస్యలకు అధిక ప్రాధాన్యత..

గత ప్రభుత్వాలు పర్చూరు నియోజవర్గాన్ని పట్టించుకోవడం మానేశాయి. కాని నేను అలా కాదు.. నేను ఇక్కడే ఉండి గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరిస్తా. అంతేకాదు సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు అందించేందుకు కృషిచేస్తాను. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేను ముందుంటానని హామీ ఇస్తున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే కాపులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఆదుకున్నాం. వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా కాపు అక్క చెల్లెమ్మలు 4.63 లక్షల మందికి 4 విడతల్లో రూ 2,.030 కోట్లు అందించారు.బీసీలను బ్యాక్ బోన్ క్లాస్‌గా నిలబెట్టిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుంది. అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటాను..

గెలిస్తే సమస్యలకు పరిష్కారం..

పర్చూరు నియోజకవర్గంలో తనను శాసన సభ్యుడిగా గెలిపిస్తే ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తాను. ప్రధానంగా సాగునీరు, తాగునీరు అందించేందుకు గుంటూరు చానల్ పొడిగింపు కోసం కృషి చేస్తాను. నియోజక వర్గంలోని రోడ్లు, మురుగు కాల్వలు, నీటి వసతులు ఏర్పాటు చేస్తాను.

జగనన్నతోనే మహిళా సాధికారత


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న హనిమిరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి

మేదరమెట్ల: జగనన్న పాలనలోనే మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానాన్ని ఇచ్చారని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సతీమణి పానెం ఆదిలక్ష్మి అన్నారు. కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె శనివారం పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ నియోజకవర్గం హనిమిరెడ్డిని, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ప్రచార కార్యక్రమానికి విచ్చేసిన హనిమిరెడ్డి సతీమణికి మేళతాళాలతో పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానికి వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్పీ


చందలూరులో పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

వేటపాలెం/జే.పంగులూరు: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు, ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహణే లక్ష్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మండల పరిధిలోని చందలూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఐదుగురుకి మించి గుంపులు, గుంపులుగా తిరగరాదని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనలో రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు, పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

› వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లిలో ఎంపీపీ, జెడ్పీహెచ్ హైస్కూల్‌ల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ శనివారం పరిశీలించారు. పోలింగ్ రోజున ఎన్‌సీసీ, మాజీ ఆర్మీ వ్యక్తుల సేవలను పోలింగ్ కేంద్రాల వద్ద ఉపయోగిస్తున్నామని తెలిపారు. మద్యం, నగదు, ఇతర ఆకర్షకాలను పంపిణీ చేస్తుంటే సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు


కారంచేడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

కారంచేడు: ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తప్పకుండా మీ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటర్లు ఎలాంటి ప్రలాభాలకు గురవ్వద్దని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ముందుగా ఆయన తహశీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో బాబూరావు, బీఎల్‌ఓలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యం, డబ్బులకు ఎవరూ ప్రలోభపడవద్దన్నారు. నీతి, నిజాయితీగా మీకు మంచి చేస్తారనే నమ్మకమున్న నాయకుడిని ఎన్నుకునేందుకు మీ ఓటు హక్కును వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు 'మానవత' పట్టాభిషేకం


ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులు

చీరాల అర్బన్: నియోజకవర్గ పరిధిలో 2024 పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత సంస్థ అభినందన సత్కారం చేసి గౌరవించడం విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని మానవత గుంటూరు శాఖ చైర్మన్ పావులూరి రమేష్ ప్రశంసించారు. శనివారం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో మానవత సేవా సంస్థ దాతలు, సీనియర్ సిటిజన్స్ సమాఖ్య సహకారంతో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో అత్యధిక మార్కులు 588 సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి డి.రవీంద్రకుమార్, 583 మార్కులు సాధించిన చీరాల కెజిఎం హైస్కూల్ విద్యార్థిని షేక్ మోతీ, 581 మార్కులు సాధించిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని జి.దివ్యస్నేహాలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కె.యల్లమందారెడ్డి, న్యాయవాది బి.హేమంత్‌కుమార్, ఎ.నాగవీరభద్రాచారి, బత్తుల బ్రహ్మారెడ్డి, షేక్ మునీరుల్లా ఖాన్, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, వడలి రాధాకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, గాదె హరిహరరావు, శివకుమార్, ఎస్.యల్లమందారెడ్డి, కె.ఏకాంబరేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

చీరాల అర్బన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది కోసం ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జె.శ్యామల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి పలు రూట్లలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. అద్దంకి నుంచి పర్చూరుకు పది బస్సులు, చీరాల నుంచి పర్చూరుకు పది బస్సులు, రేపల్లె నుంచి వేమూరుకు 20 బస్సులు, బాపట్ల నుంచి రేపల్లెకు 8 బస్సులు, రేపల్లె నుంచి భట్టిప్రోలు, చెరుకుపల్లి, బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి వరకు ఎన్నికల సిబ్బంది కోసం ప్రత్యేకంగా రెండు బస్సులు, అద్దంకి నుంచి మార్టూరు, పర్చూరు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లెకు రెండు బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

అంతిమ విజయం వైఎస్సార్ సీపీదే


పర్చూరులో ప్రచారం చేస్తున్న యడం బాలాజీ

- అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ


కుమార్తెతో కలిసి ప్రచారం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం)/కారంచేడు: సంక్షేమ పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలు లబ్ధిపొందాయని.. ఎన్నికల్లో అంతిమ విజయం వైఎస్సార్ సీపీదే కావాలని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బాగంగా ఆయన శనివారం మండల కేంద్రమైన పర్చూరులో, కారంచేడు మండలం కొడవలివారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు చూశారని, టీడీపీ నియోజక వర్గంలో గెలుపొందినప్పటికీ అభివృద్ధి వైపు దృష్టి సారించింది లేదని, ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్ట బోతుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. పర్చూరు నియోజక వర్గంలో కూడా వైఎస్సార్‌సీపీ గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో తాను చేసి చూపించి తీరుతానని ఆయన అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పర్చూరు నియోజక వర్గానికి తమ బిడ్డ యడం బాలాజీని, బాపట్ల పార్లమెంట్‌కు నందిగం సురేష్‌ను గెలిపించాలని ఆయన కోరారు. పర్చూరులో భార్యభర్తలు ఇరువురు కలిసి ఇంటింటి ప్రచారం సైతం నిర్వహించారు. అభ్యర్థి యడం బాలాజీ, ఆయన సతీమణి యడం హరిత ఇరువురు కలిసి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కఠారి అప్పారావు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ-2 ఐనంపూడి వనజ, గోగినేని సతీష్‌బాబు, కొడాలి ధర్మానందరావు, సర్పంచ్ కొడాలి మోహనకృష్ణ, చిరుమల సుధాకర్, స్వర్ణపాలెం బసవయ్య, కొల్లా వెంకట్రావు, అడపా సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.